ఎ. జయలక్ష్మి రాజు

# పొగబండి నేస్తం

రిజర్వేషన్ లేకుండా దూర ప్రయాణం రైల్లో ఎంత కష్టమో తెలిసొచ్చింది నాకు. నాతో కలిపి ఓ ఆరుగురు కొలీగ్స్ షిరిడీ వెళ్ళాలని కూడబలుక్కుని ప్రయాణమయ్యాం. కొందరు బస్సు కెడదాం అన్నారు. కొందరు జీపులో వెడదాం అన్నారు. రిజర్వేషన్ లేకుండా రైల్లో అంత దూరం అదీ జనరల్ కంపార్ట్‌మెంట్‌లో 'హమ్మో' అన్నారు మరికొందరు. 'అన్నీ సుఖంగా ఉండాలంటే ఓ నెలరోజులు ముందుగా ఆలోచించి అమర్చుకోవాలి. ఇప్పటికిప్పుడు అంటే కుదరదు. అడ్జెస్టయిపోవాలి. అయినా మనం భార్యాపిల్లలతో పోవటం లేదు కదా. అంతా మగాళ్ళం. సర్దుకుని బతకటానికి అలవాటుపడ్డ మధ్య వయసు గాళ్ళం. ఇలా అవస్థపడి ప్రయాణం చేయటం కూడా థ్రిల్లింగ్‌గా ఉంటుందం'టూ మరికొందరు వత్తాసు పలికేసరికి ఎట్టకేలకు షిరిడీ వెళ్ళి బాబాను దర్శించుకున్నాం.


'నా మటుకు నాకు చంద్రమండలం వెళ్ళొచ్చిన ఫీలింగు కలుగుతోంది!' అన్నాడు అప్పారావు.

'…రే! మధ్యతరగతి జీవులం! జిల్లా దాటి ఎరుగం కదా! అందుకే ఈ ఫీలింగు!' వెక్కిరింపుగా అన్నాడు వెంగళరావు.

'ఈ తిరుగు ప్రయాణం కూడా రిస్కు లేకుండా జరిగితే బావుండు!' సుబ్బారాయుడన్నాడు.

'అంత సీన్ ఇపుడుండదు. ట్రైన్ ఢిల్లీ నుంచి వస్తుంది కాబట్టి జనరల్ కంపార్ట్‌మెంట్ రష్‌గా ఉంటుంది. మనిషి ఎప్పుడూ తన జీవితపంథా పాజిటివ్‌లోనే ప్రయాణించాలని కోరుకుంటాడు. నెగెటివ్‌గా మాత్రం ఆలోచించడు. దురదృష్టవశాత్తూ అనుభవించాల్సి వస్తే అనుభవిస్తాడు తప్ప!' ట్రైన్ రాగానే హడావిడిగా ఎక్కేశాం!

అందరిలోనూ కంగారు. ఆత్రుత. హడావిడిగా నేను ఎక్కిన కంపార్ట్‌మెంట్‌లో నా కొలీగ్స్ ఎవరూ ఎక్కలేదు. రెండు కాళ్ళు పొందిగ్గా పెట్టుకొని నిలబడటానికి కూడా వీల్లేనంత రద్దీ. అబ్బ! కాస్త స్థలం దొరికితే బావుండు. చుట్టూ పరికించి చూశాను. ఆ కంపార్ట్‌మెంటంతా మిలిటరీ వాళ్ళతో నిండి ఉంది. ఒక్కొక్కరు ఒక్కో సీటు పూర్తిగా ఆక్రమించుకోవటమే కాకుండా కింద పైన ఖాళీస్థలంలో కూడా వారి లగేజితో నిండిపోయింది. అందరివీ ఒకే రకం డ్రస్సులు. ఒకే రకం బ్యాగులు. ఒకే రకం పెట్టెలు. ఒకే భాష. హిందీ భాష. 'హిందీ మన జాతీయ భాష! కాస్త ఇంప్రూవ్ చేసుకో. దేశంలో ఎక్కడికెళ్ళినా బాధ ఉండదు' అంటూ చిన్నపుడు నాన్నగారు హితబోధ చేస్తుంటే... 'హిందీనే రానక్కర్లేదు. నాకు ఇంగ్లీషు బాగా వస్తుంది. అయినా మనం గొర్రెతోక జీతగాళ్ళం. దేశమంతా తిరిగే భాగ్యం కూడానా? రాష్ట్రం వదిలి పక్క రాష్ట్రానికి వెళ్ళే ఛాన్సు కూడా ఉండదు' అంటూ ఆయన మీద కోపంతో అన్నీ అర్థాలు కలిసొచ్చే ఓ డైలాగు విసిరి నాన్నను చిన్నబుచ్చేవాణ్ని. ఇపుడు తెలిసొస్తోంది. భాష బాధ ఎంత కఠినంగా ఉంటుందంటే మాట్లాడటం వచ్చి కూడా మూగతనం అనుభవించటం అంటే ఇదేనేమో. వందమందిలో ఉన్నా ఒంటరితనం అనుభవిస్తున్న నేను... పొందిగ్గా నిలబడటానికి కూడా స్థలం లేని దీనావస్థలో ఉన్నట్టుండి నాకు దేవుడు గుర్తుకొచ్చాడు. 'స్వామీ! నేను ఇంతకు ముందు ప్రమోషన్ రావాలి. ఇల్లు కట్టాలి. కట్నం అడగని అల్లుడు రావాలి. మంచి కట్నంతో కోడలు రావాలి అని ప్రార్థించాను కదా! ప్రస్తుతం అవన్నీ పెండింగ్‌లో పెట్టు. అర్జంటుగా నాకు కూర్చోటానికి స్థలం ప్రసాదించు. ఈ నడివయసులో, ఈ మోకాళ్ళ నొప్పులతో పదహారు గంటలు ఇలా నిలబడి ప్రయాణం చేశానంటే జీవసమాధి అవుతాను' అంటూ ప్రార్థించాను. దేవుడికి పిలుపు అందినట్టుంది. నిల్చున్న చోటే నా బ్యాగు కింద పడేసి దానిమీదే కూర్చునే వీలు కలిగింది. ప్రాణం కాస్త కుదుటపడటంతో పడుకోటానికి స్థలం దొరికితే బావుండు... అనుకుంటూ చుట్టూ పరికించాను. ఉన్నదాంతో తృప్తిపడే లక్షణం మనిషికెప్పుడుంది గనుక!



బట్టల మూటల్లా పడి నిద్రపోతున్న ఈ మనుషులను ఏ కవి అయినా చూశాడంటే ఆపకుండా ఆరు పేజీలు కవిత్వం రాస్తాడేమో. అయినా ఈ మిలిటరీ వాళ్ళు ఎంతెంత స్థలం ఆక్రమించుకుని ఎంత హాయిగా నిద్రపోతున్నారో కదా!

ఢిల్లీ నుంచి బెంగుళూరు వెళుతున్నారట. వాళ్ళు ఎవరితోనో చెబుతుంటే విన్నాను. వాళ్ళ నిద్రను చూసి కాసేపు తిట్టుకున్నాను. కాసేపు అసూయ పడ్డాను. అర్ధరాత్రి దాటింది. ఏదో స్టేషన్‌లో దాదాపు పదిహేను నిమిషాలు రైలాగింది. 'చాయ్! చాయ్' అంటూ ఓ కుర్రాడు టీ అందిస్తూ పెట్టెలో తిరుగుతున్నాడు. ఇలా కూర్చుని తూగటం కంటే టీ తాగి నిద్రనాపుకుంటే మంచిదనిపించి ఓ టీ తీసుకుని... చిల్లర ఇస్తూ హిందీ తెలుగు కలిపి మాట్లాడాను. నెమ్మదిగా టీ సిప్ చేస్తుండగా...

'మీరు తెలుగువారా?' ఏదో అశరీరవాణి వినిపించినట్టయి చుట్టూ చూశాను. 'మీది ఆంధ్రప్రదేశా?' అంతవరకు ఓ సీటు నిండా కాళ్లారజాపుకుని నిద్రపోతుండగా కసిదీరా నా తిట్లకు గురయిన ఓ నడివయసు శాల్తీ లేచి కూర్చుని టీ తాగుతూ నన్ను ప్రశ్నించాడు. అతను నాకు ఎడారిలో ఒయాసిస్సులా కనిపించాడు. అందుక్కారణం అతను తెలుగు మాట్లాడటం ఒకటయితే... అతని ప్రక్కన చాలా స్థలం ఖాళీగా ఉండటం మరొకటి.

'అవునండి! అనంతపురం! మీరూ తెలుగువారేనా?' అన్నాను నవ్వు పులుముకుంటూ.

'అవును! ఇలా వచ్చి కూర్చోండి!' అన్నాడు అతనూ చిరునవ్వు నవ్వుతూ.

నిజం చెప్పొద్దూ! ఆ సమయంలో అతను నాకు దేవేంద్రుడిలా కనిపించి లేచి నిల్చుని తన సింహాసనం నాకు చూపిస్తూ 'టేక్ యువర్ సీట్' అన్నంత అమృతప్రాయంగా వినిపించింది.

బతుకుజీవుడా అనుకుని అతని పక్కన ఫ్రీగా కూర్చున్నాను.

అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న నాలుక మాట్లాడటానికి మొహం వాచిపోయినట్టు నిర్విరామంగా తన పని తాను చేసుకుపోసాగింది.

అతనూ నాలాంటి నడివయసు మనిషి. పేరు రాఘవరావు. స్వస్థలం విజయవాడ దగ్గర ఓ పల్లెటూరు. ముసలితల్లి, భార్య, ఓ కొడుకు, కూతురు ఉన్నారు. కూతురు పెళ్ళికెదిగింది. కొడుకు చదువుకుంటున్నాడు. ఆరునెలలకోసారి ఊరు వెళ్ళి వస్తుంటాడు. ప్రస్తుతం అతని ఉద్యోగం ఢిల్లీలో. ఉద్యోగరీత్యా పని మీద బెంగుళూరు వెళుతున్నారట.

బెంగుళూరులో నెలరోజులుండి మళ్ళీ ఢిల్లీ వెళతారట. ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళుతూ కూడా అయిన వారిని చూసే అవకాశం లేదంటున్న అతన్ని చూసి జాలి పడ్డాను. ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయాలు, కరువు, పంటలు, దేవాలయాలు సంభాషణలో చోటు చేసుకుని పూర్తిగా తెల్లవారేలా చేశాయి. ఇద్దరం ఒకే వయసు వారు కావటంవల్లనేమో అతి తక్కువ సమయంలో స్నేహితులమవటమే కాక... ఇక కొద్ది గంటల్లో మేమిద్దరమూ విడిపోతామన్న భావన ఇద్దరి మనసుల్నీ తొలిచివేసింది.

'మీకో పని చెబుతాను చేస్తారా?' ఉన్నట్టుండి రాఘవరావు అన్నాడు.

'చెప్పండి! తప్పకుండా చేస్తాను' అన్నాను.

'ఇంకో రెండు రోజుల్లో కొత్త సంవత్సరం వస్తుంది. ప్రతిసారి ఇంటికి గ్రీటింగ్స్ పంపటం అలవాటు. ఇంట్లో పిల్లలు నేను పంపే గ్రీటింగ్స్ కోసం ఎదురుచూస్తుంటారు. ఈసారి ఇలా రైల్లో ఉండిపోయాం. ఓ లెటర్ రాసిస్తాను. గ్రీటింగ్స్‌కు అవసరమైన డబ్బు కూడా ఇస్తాను. మంచి గ్రీటింగ్ కొని ఈ అడ్రస్‌కు పోస్టు చేస్తారా?' అన్నాడు రాఘవరావు.

'అదేమంత పెద్ద పని! రాసివ్వండి తప్పకుండా పోస్టు చేస్తాను' అన్నాను.

'సాధారణంగా ఇలాంటి పోస్టు పనులన్నీ మీలాంటి పొగబండి నేస్తాలే చేసి పెడుతుంటారు' నవ్వుతూ ఉత్తరం రాసిచ్చాడు. అడ్రస్ కాగితం ఉత్తరం భద్రంగా జేబులో పెట్టుకున్నాను. ట్రైన్ అనంతపురం స్టేషన్‌లో ఆగింది. ఇద్దరమూ బరువెక్కిన మనసులతో వీడ్కోలు చెప్పుకున్నాం. మమ్మల్నిద్దరినీ వేరుచేస్తూ రైలు వెళ్ళిపోయింది.

★ ★ ★

మళ్ళీ సంసారం... ఇల్లు... ఆఫీసు... సిటీబస్సులు... హడావిడి. రెండు పగళ్ళు, రెండు రాత్రిళ్ళు గడిచాక రాఘవరావు ఉత్తరం గుర్తుకొచ్చింది. తీరా చూస్తే నా శ్రీమతి నా చొక్కాలను చూడకుండా తడపటం ఉత్తరం అడ్రసున్న పేపరు తడిసి ముద్దయి చిరగటం కూడా జరిగిపోయాయి. నా మనసు బాధగా మూలిగింది. నా భార్యను తిట్టిపోశాను. ఏది ఏమైనా రాఘవరావు నన్ను నమ్మి చెప్పిన ఎంతో చిన్న పని నేను చెయ్యలేకపోయాను. నా భార్య ముందు... కొడుకు ముందు... కూతురి ముందు... కొలీగ్స్ ముందు... ఆ విషయం తలచుకుని బాధపడ్డాను. అందరూ అనునయించారు. ఉత్తరంలో ఏం రాసినప్పటికీ ఈపాటికి ఆయన ఇంకో ఉత్తరం ఇంటికి రాయకుండా ఉండడు. ఇకపోతే గ్రీటింగ్స్... ఒక్కోసారి రిజిస్టరు పోస్టులాంటి ఉత్తరాలే ఏళ్ళ తరబడి ప్రయాణం చేసి ఎప్పటికో అందుతుంటాయి. అంత బాధపడవలసిన అవసరం లేదని ఓదార్చారు. రాఘవరావు పేరు... ఆయన ఊరి పేరు మాత్రం ఇంట్లో అందరి నోళ్ళలో చాలారోజులు నానాయి. చాలా రోజుల దాకా నేనా విషయం మరిచిపోలేక పోయాను. ముఖ్యంగా రైలు ప్రయాణం చేసినప్పుడంతా ఆ విషయం గుర్తుకువచ్చి నా మనసు బాధడుతుండేది. మూడు సంవత్సరాలు గడిచిపోయాయి.

★ ★ ★

అప్పుడే బజారు నుంచి వచ్చిన నాకు అబ్బాయి నించి ఉత్తరం వచ్చిందంటూ శ్రీమతి కవరు చేతిలో పెట్టింది.

'నాన్నగారూ! మన మధ్య తండ్రీ కొడుకుల అనుబంధం కంటే స్నేహ బంధమే ఎక్కువ. అందువల్లనే మరీ నాన్చకుండా సూటిగా పాయింటులో కొచ్చి



నాన్నగారూ! ఉత్తరం పోస్టు చేయక పోవటం ఎంతో చిన్న విషయం అని అప్పట్లో మనం తేలిగ్గా తీసుకున్నాం. ఆ పోస్టుచేయని ఉత్తరం వల్ల వారి కుటుంబం మానసిక క్షోభకు గురయిందని తెలుసుకుని చాలా బాధపడ్డాను.

మనసు విప్పి చెబుతున్నాను. ఇక్కడ మా ఫ్రెండ్ ఒకతను పెళ్ళిచూపులు అంటూ విజయవాడ దగ్గర ఓ ఊళ్ళో ఏర్పాటుచేసి తీసికెళ్ళాడు. అమ్మా నాన్నా లేకుండా ఎలా? అన్నాను. ముందు నువ్వు చూసి నచ్చితే పెద్దవాళ్ళనూ తీసుకు రావచ్చునన్నాడు. అయిష్టంగానే వెళ్ళాను. తీరా వెలితే ఆ ఊరు రాఘవరావుగారి ఊరు. నేను వెళ్ళిందీ వారింటికే! రాఘవరావుగారి కూతురే పెళ్ళికూతురు. నాన్నగారూ! ఉత్తరం పోస్టు చేయకపోవటం ఎంతో చిన్న విషయం అని అప్పట్లో మనం తేలిగ్గా తీసుకున్నాం. ఆ పోస్టుచేయని ఉత్తరం వల్ల వారి కుటుంబం మానసిక క్షోభకు గురయిందని తెలుసుకుని చాలా బాధపడ్డాను. మీరు షిరిడీ నుంచి వచ్చిన పది రోజులకే రాఘవరావుగారి తల్లి మరణించింది. ఆ సమయంలో రాఘవరావుగారు బెంగుళూరులో ఉన్నారు. ఆ విషయం తెలుపుతూ అడ్రసిస్తూ ఇంటికి ఉత్తరం రాసి మీకిచ్చారు. ఆ ఉత్తరం వారి కందనందువల్ల ఢిల్లీకి ఫోన్లు టెలిగ్రాంలు ఉత్తరాలు విసిగిపోయారు. తల్లి అంత్యక్రియలకే కాదు పెద్ద ఖర్మ రోజుకు కూడా రాఘవరావుకు విషయం తెలియలేదు. తర్వాతెప్పుడో తెలిసిందట. ఈ విషయాలన్నీ రాఘవరావుగారు డైరీలో రాసుకొన్నారట. 'ఓ పొగబండి నేస్తానికి, పోస్టు చెయ్యమని ఉత్తరం గ్రీటింగ్స్ ఇచ్చాను. అవి దారి తప్పినట్టున్నాయి. అమ్మను చివరి క్షణాల్లో చూసుకోలేక పోయాను' అని రాసుకున్నారట. డైరీలో మీ పేరు లేదుట. ఈ విషయాలన్నీ నా స్నేహితుడు చెప్పాడు. ఇకపోతే రాఘవరావుగారు ఈ మధ్యనే చని పోయారుట. చివర్లో నేను మీకు చెప్పబోయేదేమిటంటే రాఘవరావుగారి అమ్మాయి పెళ్ళిచూపుల్లో నాకు నచ్చింది. బహుశ మీకు నచ్చకపోవచ్చు. ఎందుకంటే ఆ అమ్మాయికి ఓ కాలు, చెయ్యి పోలియో వ్యాధి. ఏది ఏమైనా సరే నేనా అమ్మాయినే పెళ్ళి చేసుకోవాల ...ం టున్నాను. నా మాట మీరెప్పుడూ కాదనరని తెలుసు అయితే నేను మీకు విన్నవించుకొనేదేమిటంటే రాఘవరావుగారి పొగబండి నేస్తం మీరేనన్న విషయం భవిష్యత్తులో మీ కోడలికి గానీ ఆమె తల్లికిగానీ తెలియటం మంచిది కాదు. వారి కుటుంబం ఇతరుల జాలిని... దయాబిక్షను మాత్రం భరించలేరన్న విషయం ...తి తక్కువ సమయంలోనే గ్రహించాను. నేనా అమ్మాయిని పశ్చాత్తాపానికి చిహ్నంగా పెళ్ళి చేసుకుంటున్నానని వారికి తెలిస్తే భరించలేరు. నా మనసు గ్రహిస్తారని ఆశిస్తూ మీ ప్రదీప్!'

ఉత్తరం చదవటం పూర్తయ్యేసరికి నా కళ్ళ వెంట నీరు సుడులు తిరిగింది. ఆ కన్నీళ్ళు పొగబండి నేస్తం పరమపదించినందుకో... లేక యాదృచ్ఛికంగా అతని కూతురు నా కోడలవుతున్నందుకో... లేక నా మనసెరిగి ఎప్పుడో నేను చేసిన పొరపాటుకు తాను శిక్ష అనుభవిస్తానన్నట్టు అవిటి అమ్మాయిని భార్యగా స్వీకరిస్తున్న నా కొడుకు ఔదార్యానికో... నాకయితే అర్థం కాలేదు.

